ఎవరూ గెలిచినా చరిత్రే..

నేడు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఫైనల్ • మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ

దుబాయ్: ప్రతిష్ఠాత్మక మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీలో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న ప్రపంచకప్ టోర్నీని ఎలాగైనా ముద్దాడాలన్న పట్టుదలతో ఉన్న దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఆదివారం టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనున్నాయి. అనూహ్య విజయాలతో మెగా టోర్నీ ఫైనల్లో నిలిచిన దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లో ఎవరూ గెలిచినా కొత్త చరిత్ర కానుంది. 2009లో మొదలైన టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటి వరకు ఆస్ట్రేలియా అత్యధికంగా ఆరుసార్లు చాంపియన్‌గా నిలిస్తే..ఇంగ్లండ్, వెస్టిండీస్ ఒక్కోసారి టైటిల్‌ను సొంతం చేసుకున్నాయి. సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపించిన సఫారీలు మంచి జోష్‌మీదుంటే..మరో సెమీస్‌లో కరీబియన్లను ఓడించిన కివీస్..తొలిసారి టైటిల్ ఒడిసిపట్టుకోవాలని చూస్తున్నది. టోర్నీకి ముందు వరుసగా 10 మ్యాచ్‌ల్లో ఓడిన కివీస్..అంచనాలను తలక్రిందులు చేస్తూ సోఫీ డివైన్ కెప్టెన్సీలో వరుస విజయాలతో కదంతొక్కింది. డివైన్‌కు తోడు సుజీబేట్స్, అమెలియా కెర్ రాణిస్తే..కివీస్‌కు తిరుగుండకపోవచ్చు. దక్షిణాఫ్రికా తరపున వోల్వార్డ్(190), తంజిమ్ బ్రిట్స్(170) టాప్‌స్కోరర్లుగా కొనసాగుతున్నారు. జట్టు మరోమారు సమిష్టి ప్రదర్శన కనబరిస్తే..సఫారీల కప్ కల నెరవేరినట్లే.

భారత్ బోణీ

సుల్తాన్ జోహర్ కప్

జోహర్(మలేషియా): సుల్తాన్ జోహర్ కప్ టోర్నీలో భారత యువ హాకీ జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 4-2తో జపాన్‌పై అద్భుత విజయం సాధించింది. అమిర్ అలీ(12ని), గుర్జోత్‌సింగ్(36ని), ఆనంద్ సౌరభ్(44ని), అంకిత్‌పాల్(47ని) యువ భారత్ తరపున గోల్స్ చేశారు. సుబాస తనాక(26ని), రకుసి యమనక(57ని) జపాన్‌కు గోల్స్ అందించారు. దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ జూనియర్ హాకీ జట్టు కోచ్‌గా బాధ్యతలు అందుకున్న తర్వాత భారత్‌కు దక్కిన తొలి విజయం ఇది. మ్యాచ్‌లో ఆది నుంచే తమదైన దూకుడు కనబరిచిన కుర్రాళ్లు.. జపాన్ డిఫెన్స్‌ను ఛేదిస్తూ వరుస గోల్స్‌తో విరుచుకుపడ్డారు. అలీ గోల్‌తో మొదలైన భారత్ గోల్ పరంపర చివరి వరకు కొనసాగింది.

టైటాన్స్‌కు ఝులక్

తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్‌కు చుక్కెదురైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-44 తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమిపాలైంది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్(10) వరుసగా రెండో సారి సూపర్-10 సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. పవన్‌కు తోడు విజయ్ మాలిక్(9) పోరాటం టైటాన్స్‌కు కలిసి రాలేదు. నరేందర్ ఖండోలా, సచిన్ సూపర్-10 ప్రదర్శనలతో తమిళ్ తలైవాస్ భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణెరీ పల్టాన్ 35-25 తేడాతో హర్యానా స్టీలర్స్‌పై విజయం సాధించింది

అద్భుతం జరిగేనా!

- సర్ఫరాజ్ సూపర్ సెంచరీ
- ఒక్క పరుగుతో పంత్ శతకం చేజారె
- భారత్ రెండో ఇన్నింగ్స్ 462 ఆలౌట్

టెస్టు ఒక ఇన్నింగ్స్‌లో సున్నాకు ఔటై మరో ఇన్నింగ్స్‌లో 150కి పైగా పరుగులు చేసిన మూడో భారత బ్యాటర్‌గా సర్ఫరాజ్(0, 150) నిలిచాడు. మాధవ్ ఆప్టే(0, 163★), నయన్ మోంగియా(152, 0) మిగతా ఇద్దరు బ్యాటర్లు.

2

కివీస్ లక్ష్యం 107, ప్రస్తుతం 0/0

బెంగళూరు టెస్టులో ఏదైనా అద్భుతం జరిగేనా! ప్రతీ భారత అభిమాని మదిని తొలుస్తున్న ప్రశ్న ఇది. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలిన రోహిత్‌సేన మలి ఇన్నింగ్స్‌లో సత్తాచాటింది. సీనియర్ల నిష్క్రమణ వేళ సర్ఫరాజ్‌ఖాన్ సూపర్ సెంచరీకి తోడు పంత్ పోరాటంతో 462 పరుగుల భారీ స్కోరు అందుకుంది. ఈ ఇద్దరు యువ బ్యాటర్లు కివీస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలిచారు. దేశవాళీ ఫామ్‌ను దిగ్విజయంగా కొనసాగిస్తూ సర్ఫరాజ్ దుమ్మురేపితే..గాయాన్ని కూడా లెక్కచేయకుండా పంత్ చేసిన పోరాటం వారెవ్వా అనిపించింది. కివీస్ బౌలర్లను దునుమాడుతూ ఈ ఇద్దరు చిన్నస్వామి స్టేడియంలో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో కదంతొక్కారు. భారీ లక్ష్యం దిశగా దూసుకెళుతున్న భారత్‌ను హెన్రీ, ఒరూర్కీ మరోమారు దెబ్బతీశారు. వీరి ధాటికి భారత్ 52 పరుగుల తేడాతో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. 107 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనలో కివీస్ సఫలం అవుతుందా లేక..వరుణుడి అంతరాయంతో ఆఖరి రోజు ఆట రద్దు అవుతుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది. అద్భుతం జరిగితే సరిగ్గా 20 ఏండ్ల క్రితం ఆస్ట్రేలియాపై గెలిచినట్లు కివీస్‌పై చారిత్రక విజయం మన సొంతమైనట్లే.

బెంగళూరు: సొంతగడ్డపై తమకు తిరుగులేదనుకున్న భారత్‌కు న్యూజిలాండ్ రూపంలో ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ బోణీ కొట్టేందుకు చేరువలో ఉంది. భారత్ నిర్దేశించిన 107 పరుగుల లక్ష్యఛేదన కోసం ఆదివారం కివీస్ బరిలోకి దిగనుంది. సరిగ్గా 36 ఏండ్ల క్రితం ముంబై వాంఖడే మైదానంలో భారత్‌పై న్యూజిలాండ్ చివరి సారి విజయం సాధించింది. ఇందులో దిగ్గజ బౌలర్ రిచర్డ్ హ్యాడ్లీ 10 వికెట్ల ప్రదర్శనతో కివీస్ విజయంలో కీలకమయ్యాడు. మళ్లీ ఇన్నేండ్లకు టీమ్‌ఇండియాపై గెలిచే అవకాశం వచ్చింది. ఓవర్‌నైట్ స్కోరు 231/3తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్..సర్ఫరాజ్‌ఖాన్(195 బంతుల్లో 150, 18ఫోర్లు, 3సిక్స్‌లు) సూపర్ సెంచరీకి తోడు రిషబ్ పంత్(105 బంతుల్లో 99, 9ఫోర్లు, 5సిక్స్‌లు) వీరోచిత పోరాటంతో 462 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌తో నిరాశపరిచినా..ముంబైకర్ సర్ఫరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత శతకంతో కదంతొక్కాడు. ఓవైపు సీనియర్లు నిరాశపరిచినా..అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ భారత్‌ను పోటీలో నిలిపాడు. జడేజా బౌలింగ్‌లో గాయపడ్డ పంత్ పోరాటం ఆకట్టుకుంది. కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన పంత్ పరుగు తేడాతో సెంచరీకి దూరమయ్యాడు. వీరిద్దరు సాధికారిక ఇన్నింగ్స్‌తో కివీస్ ముందు భారత్ లక్ష్యాన్ని నిర్దేశించగల్గింది. అయితే మ్యాట్ హెన్రీ(3/102), ఒరూర్కీ(3/92) మరోమారు చెలరేగడంతో టీమ్ ఇండియా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. రాహుల్(12), జడేజా(5), అశ్విన్(15) విఫలం కాగా, బుమ్రా(0), సిరాజ్(0) సున్నాలు చుట్టారు.

సర్ఫరాజ్, పంత్ అదుర్స్: సర్ఫరాజ్, రిషబ్ పంత్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఓవైపు సీనియర్లు నిష్క్రమించినా.. ఏమాత్రం వెనుకకు తగ్గకుండా కివీస్ బౌలింగ్ దాడిని కాచుకు కూర్చున్నారు. ఆస్ట్రేలియాపై ఈడెన్‌గార్డెన్స్‌లో ద్రవిడ్, లక్ష్మణ్ ఇన్నింగ్స్‌ను వీరిద్దరు గుర్తుకు తెచ్చారు. పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును ఒడ్డుకు చేర్చుతూ పరుగులు కొల్లగొట్టారు. దేశవాళీలో దుమ్మురేపుతున్న సర్ఫరాజ్..కివీస్‌పై అదే పంథాను కొనసాగించాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా మైదానం నలువైపులా చూడచక్కని షాట్లతో అలరించాడు. మరోవైపు గాయంతో అసలు బ్యాటింగ్‌కు వస్తాడా అన్న అనుమానాలను పటాపంచలు చేసిన పంత్ ఇన్నింగ్స్ ఆదిలో ఒకింత తడబడ్డాడు. ఖాన్‌తో ఓసారి రెండో పరుగు కోసం ప్రయత్నించిన పంత్..తృటిలో రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఇక అక్కణ్నుంచి వెనుదిరిగి చూసుకోని పంత్..కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తనదైన ట్రేడ్‌మార్క్ షాట్లతో కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సాధ్యమైన లక్ష్యంగా చేసుకుంటూ పంత్ కొట్టిన భారీ సిక్స్ స్టేడియం బయటికి రాకెట్‌లా దూసుకెళ్లింది. మరో ఎండ్‌లో సర్ఫరాజ్..స్విచ్ షాట్లు, అప్పర్ కట్‌లతో అదరగొట్టాడు. ఒకానొక దశలో సర్ఫరాజ్ దూకుడు అడ్డుకునేందుకు కివీస్ కెప్టెన్ లాథమ్ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. కెరీర్‌లో తొలిసారి సెంచరీ మార్క్ అందుకున్న సర్ఫరాజ్..పంత్‌తో కలిసి సంబురాలు చేసుకున్నాడు. ఈ జోడీని విడగొట్టేందుకు బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా కివీస్‌కు లాభం లేకపోయింది.

54 పరుగులు..7 వికెట్లు

కివీస్ కెప్టెన్ కొత్త బంతి ఎంచుకోవడం మ్యాచ్ గతిని మార్చేసింది. అప్పటి వరకు సర్ఫరాజ్, పంత్‌ను నిలువరించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించిన లాథమ్..కొత్త బంతితో అనుకున్న ఫలితాన్ని రాబట్టాడు. హెన్రీ, ఒరూర్కీ స్వింగ్‌తో భారత్ 54 పరుగుల తేడాతో చివరి 7 వికెట్లు కోల్పోయింది. సర్ఫరాజ్ ఔట్‌తో నాలుగో వికెట్‌కు 177 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత వచ్చిన రాహుల్, జడేజా, అశ్విన్, బుమ్రా, సిరాజ్ వెంటవెంటనే ఔట్ కావడంతో టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ తర్వాత ఛేదనకు దిగిన కివీస్..వెలుతురులేమితో ఆట కొనసాగించలేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46 ఆలౌట్, **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** 402 ఆలౌట్, **భారత్ రెండో ఇన్నింగ్స్:** 462 ఆలౌట్, **న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్:** 0/0

అథ్లెటిక్స్‌లో శ్రీను అదుర్స్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 19 : అథ్లెటిక్స్ పోటీలో నాగర్‌కర్నూల్ జిల్లా వాసి ప్రతిభ చాటాడు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(గుంటూరు)లో జరుగుతున్న 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కాట్రావత్ శ్రీను సత్తా చాటాడు. మొదటిరోజు శనివారం జరిగిన 1500 మీటర్ల పరుగు పందాన్ని 3:55.7 సెకన్లలో పూర్తి చేసి సరికొత్త మీట్ రికార్డు నెలకొల్పాడు. ఈ విషయాన్ని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వాములు తెలిపారు.

హైదరాబాద్ 244/5

డెహ్రాడూన్: హైదరాబాద్, ఉత్తరాఖండ్ మధ్య రంజీ గ్రూపు-బీ పోరు రసవత్తరంగా సాగుతున్నది. రాహుల్ రాదేశ్(82 నాటౌట్), హిమతేజ(78) అర్ధసెంచరీలతో చెలరేగడంతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 244 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో రాదేశ్, హిమతేజ ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 142 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఓవర్‌నైట్ స్కోరు 313/8తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఉత్తరాఖండ్ 325 పరుగులకు ఆలౌటైంది. తనయ్ త్యాగరాజన్ (4/85) నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

యువ భారత్ విజయం

అల్ అమెరాత్: ఏసీసీ ఎమర్జింగ్ ఆసియాకప్‌లో యువ భారత్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 7పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తుచేసింది. తొలుత కెప్టెన్ తిలక్‌వర్మ(44), ప్రభ్‌సిమ్రన్‌సింగ్(36) రాణించడంతో టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 183/8 స్కోరు చేసింది. ముఖీమ్ (2/28) రెండు వికెట్లు తీశాడు. లక్ష్యఛేదనలో పాక్ 176/7 స్కోరుకు పరిమితమైంది. అన్షుల్ (3/33), సలామ్(2/30), నిశాంత్ (2/15) రాణించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.